క్లుప్తంగా

బంగారు పోచమ్మతల్లికి బోనం



ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

జగిత్యాలరూరల్(రాయికల్): రాయికల్ పట్టణంలో మహేంద్రసంఘం ఆధ్వర్యంలో ఎర్రకుంటలోని కంకాలమ్మ ఆఆలయం వద్ద గల బంగారు పోచమ్మతల్లికి గురువారం బోనం సమర్పించారు. మహిళలు బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చిలువేరి చిన్నరాజం, ప్రధాన కార్యదర్శి శనిగరపు రాజనర్సయ్య, మహేంద్రసంఘం అధ్యక్షుడు చిలువేరి సురేశ్, ప్రధాన కార్యదర్శి చిలువేరి నాగరాజు, వేముల నర్సయ్య, లింగం, లక్ష్మణ్, గంగరాజం పాల్గొన్నారు.

నిరుపేద యువతి వివాహానికి సాయం



సాయం అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్

జగిత్యాలరూరల్(రాయికల్): రాయికల్ పట్టణానికి చెందిన నిరుపేద యువతి బట్టు రోషిణి వివాహం కోసం రాయికల్ లయన్స్‌క్లబ్ వారు గురువారం నూతన వస్త్రాలతో పాటు రూ.14,500 నగదును మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు చేతుల మీదుగా అందజేశారు. డీసీ బత్తిని భూమయ్య, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు ఎద్దండి దివాకర్, కొత్తపల్లి రంజిత్‌కుమార్, చౌడారపు లక్ష్మీనారాయణ, సుదవేణి మురళి, నిమ్మల వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు జయంతి



నివాళి అర్పిస్తున్న సంఘం నాయకులు

కోరుట్ల: పట్టణంలో పొట్టి శ్రీరాములు జయంతి గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కూరగాయల మార్కెట్ సమీపంలో గల ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ గ్రేటర్ కోరుట్ల అధ్యక్షుడు రేగొండ శిరీష్, సెక్రటరీ శ్రీకాంత్, మహేశ్ పాల్గొన్నారు.

ఘనంగా ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన



కుంకుమపూజలో పాల్గొన్న మహిళలు

జగిత్యాలరూరల్(రాయికల్): రాయికల్ మండలం సింగరావుపేట గ్రామంలో దాసాంజనేయ స్వామి దేవాలయ పునరుద్ధరణ, ధ్వజస్తంభ శిఖర ప్రతిష్ఠాపన మహోత్సవాలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు కుంకుమ పూజల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాంచందర్‌రావు, ఉప సర్పంచ్ భీమన్న పాల్గొన్నారు.

రెండోరోజు స్వచ్ఛభారత్



వీధులను శుభ్రం చేస్తున్న వలంటీర్లు

కొడిమ్యాల: మండలంలోని జేఎన్‌టీయూహెచ్ యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో ఏడు రోజుల ప్రత్యేక శిబిరంలో భాగంగా రెండో రోజు హిమ్మత్‌రావుపేట, డబ్బు తిమ్మయపల్లి గ్రామాల్లో స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్.ప్రవీణ్‌కుమార్, గ్రామ సర్పంచ్ క్రిష్టారావు, సంగీత, డబ్బు రాధాగౌతమ్‌రెడ్డి, జేఎన్‌టీయూ సిబ్బంది, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్స్ పాల్గొన్నారు.

గల్ఫ్ బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

కథలాపూర్: మండలంలోని గంభీర్‌పూర్ గ్రామానికి చెందిన లంకదాసరి వెంకటేశ్ గత నెలలో గల్ఫ్‌లో మృతిచెందాడు. కాగా ఖతర్‌లో ఉంటున్న గంభీర్‌పూర్ వాసులు 20 మంది కలిసి రూ.32వేలు మృతుడి భార్య పద్మకు గురువారం పంపించినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు.

‘బోరు’మంటున్న రైతన్న

- చేతికందే సమయంలో ఎండుతున్న వరిపంట
- బోర్లు వేసినా.. చుక్కనీరు రాని వైనం
- కథలాపూర్ మండలంలో 20,594 ఎకరాల్లో సాగు



భూషణరావుపేట శివారులో ముస్కు రాము వేసిన బోరులో చుక్కనీరు పడని దృశ్యం

కథలాపూర్: ఆరుగాలం శ్రమించి పండించిన పంటలు చేతికందే సమయంలో బోర్లు ఎత్తేయడంతో ఎండిపోతున్నాయని అన్నదాతలు వాపోతున్నారు. ఇన్నిరోజులుగా కాపాడుకున్న పంట కళ్ల ముందే ఎండిపోవడంతో కొత్తగా బోర్లు వేసి కాపాడుకుందామంటే చుక్కనీరు రావడంలేదంటున్నారు కథలాపూర్ మండల రైతులు.

మండలంలో 20,594 ఎకరాల్లో సాగు..

కథలాపూర్ మండలంలో 19 గ్రామాలున్నాయి. ఈ ఏసంగి సీజన్‌లో 20,594 ఎకరాల్లో వరిపంట సాగు చేశారు. మండలంలోని దూలూర్, తక్కళ్లపెల్లి, దుంపేట, కథలాపూర్, పెగ్గెర్ల గ్రామాల శివారు నుంచి ఎస్సారెస్పీ వరదకాలువ వెళ్తుంది. ఈ గ్రామాల రైతులు వరదకాలువకు మోటార్లు ఏర్పాటు చేసుకొని సాగు చేస్తున్నారు. భూషణరావుపేట, ఊట్‌పెల్లి గ్రామాలకు నీళ్లందించే రాళ్లవాగు ప్రాజెక్టు గేట్లు ఇష్టమొచ్చినట్లు తిప్పడంతో ఈ రెండు గ్రామాల భూములకు నీళ్లు అందడంలేదని రైతులు తెలిపారు. ఆయా గ్రామాల రైతులు బోరుబావులను నమ్ముకొని వరి సాగు చేయగా.. భూగర్భజలాలు అడుగంటిపోయి బోర్లు ఎత్తేసి పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాండ్ర్యాల గ్రామ శివారులోని ఊర చెరువులో నీళ్లు అడుగంటగా.. బోరుబావులు ఎత్తేస్తున్నాయని రైతులు పేర్కొంటున్నారు.

బోర్లు వేసినా.. చుక్కనీరు రాని వైనం

ఈ యాసంగిలో సాగుచేసిన వరి పంటను కాపాడుకునేందుకు భూషణరావుపేట, చింతకుంట, ఊట్‌పెల్లి, పెగ్గెర్ల, తాండ్ర్యాల, కథలాపూర్, దుంపేట గ్రామాల రైతులు బోరు వేయగా చుక్కనీరు రాలేదని, బోరువేసి అప్పులపాలయ్యామని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఒక్క బోరుబావి వేయిస్తే రూ.20వేల నుంచి రూ.30వేల వరకు ఖర్చు అవుతోందని రైతులు చెప్పారు. ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు చొరవ చూపి రాళ్లవాగు ప్రాజెక్టు ద్వారా నీళ్లు విడుదల చేయించాలని, సూరమ్మ ప్రాజెక్టులోకి ఎల్లంపెల్లి ఎత్తిపోతల నీళ్లు వచ్చేలా చూస్తే భూగర్భజలాలు పెరిగి పంటలు కాస్తా కాపాడుకోవచ్చని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

రూ.60వేలు వృథా అయ్యాయి



ఐదెకరాల్లో వరి సాగుచేసిన. ఇన్నిరోజులు రెండు బోరుబావుల్లో పుష్కలంగా నీళ్లు ఉండడంతో పంటలు ఎదిగాయి. ఆ రెండు బోరుబావులు అడుగంటాయి. కొత్తగా మూడు బోరుబావులు వేయించిన. నీరు పడలేదు. బోర్లకు రూ.60వేలు ఖర్చు అయ్యాయి. వరి ఎండడంతో రూ.4లక్షలు నష్టపోయిన. రాళ్లవాగు ప్రాజెక్టు నీళ్లు వస్తే బాగుంటుంది. – గుగ్లోత్ రవి, రైతు, భూషణరావుపేట

పంటకు నీరందడం లేదు



యాసంగిలో రెండు ఎకరాల్లో వరిపంట వేసిన. ఒక్క బోరుతో నీరందించాను. ఇప్పుడు బోరుబావి ఎత్తేయడంతో వరి పంటకు నీళ్లందడం లేదు. రెండెకరాల్లో వరి పంట ఎండిపోయింది. సూరమ్మ ప్రాజెక్టు నుంచి తాండ్ర్యాల చెరువుకు నీళ్లు వస్తే పంటలకు లాభం ఉంటుంది.

– హన్మంతరావు, రైతు, తాండ్ర్యాల

ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రారంభం



మల్లాపూర్: విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది



ఇబ్రహీంపట్నం: పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు



ఇబ్రహీంపట్నం: దివ్యాంగ విద్యార్థిని పరీక్ష కేంద్రానికి తీసుకొస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

మల్లాపూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో గురువారం ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్ష ప్రశాంతగా ముగిసింది. 252 మంది విద్యార్థులకు గాను నలుగురు గైర్హాజరైనట్లు పరీక్షల ముఖ్య నిర్వహణ అధికారి ప్రమీల, శాఖ అధికారి మొయినుద్దీన్ తెలిపారు. ఇంటర్ పరీక్షలు పూర్తయ్యే వరకు పరీక్ష కేంద్రం వద్ద ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందని సీఎస్ ప్రమీల, ఎస్సై నవీన్‌కుమార్ ఈ సందర్భంగా తెలిపారు.

ఇబ్రహీంపట్నంలో..

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నంలో 289 మంది విద్యార్థులకు ఆరుగురు విద్యార్థులు గైర్హాజరు అయినట్లు ప్రిన్సిపాల్ సంజీవ్ తెలిపారు. ఇంటర్ దివ్యాంగ విద్యార్థి రాకేశ్ వాకర్ సాయంతో పరీక్ష రాసేందుకు రాగా అధ్యాపకులు, విద్యార్థులు పరీక్ష హాల్ వరకు తీసుకువెళ్లి కూర్చోబెట్టారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రం ప్రారంభిస్తున్న ఆది శ్రీనివాస్

మేడిపెల్లి: బీమారం మండలం వెంకట్రావ్‌పేట్‌లో చలివేంద్రాన్ని రాజన్న సిరిసిల్ల డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో రమేశ్‌రెడ్డి, ముంజ కిషన్, అజయ్‌కుమార్, మక్బుల్, జీవన్, పాల్గొన్నారు.

నిత్యావసరాలు పంపిణీ



నిత్యావసరాలు అందిస్తున్న సంస్థ సభ్యులు

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పేదరికంలో ఉన్న మూడు కుటుంబాలకు ప్రతి నెలా నెలకు సరిపడా నిత్యావసర వస్తువులు పంపిణీ చేస్తున్నారు. ధర్మపురికి చెందిన దొంగరి పద్మ సురేశ్, మసీదు లక్ష్మి, పెంకర్ల శిరీష కుటుంబాలకు రూ.2,500 విలువ గల నిత్యావసర వస్తువులను గురువారం పంపిణీ చేశారు. సంస్థ సభ్యులు రంగ హరినాథ్, రంగు లక్ష్మీనరహరి, పప్పుల శ్రీనివాస్, కొండ రవీందర్, సిర్ప రాజేందర్, జన్మంచి నర్సయ్య, పెండ్యాల రాజేశ్ ఉన్నారు.

ముదిరాజ్ యువజన సంఘం మండల అధ్యక్షుడిగా శేఖర్



అధ్యక్షుడిని సన్మానిస్తున్న సర్పంచ్ సుదర్శన్

మల్యాల: ముదిరాజ్ యువజన సంఘం మండల అధ్యక్షుడిగా దొంతరవేని శేఖర్‌ను నియమించారు. మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన సమావేశంలో జిల్లా అధ్యక్షులు బాలు, చరణ్ ఈ మేరకు శేఖర్‌కు నియామకపత్రం అందించారు. కొండగట్టులో ముదిరాజ్ మహాసభ సత్రాన్ని ఏర్పాటు చేసేందుకు అవసరమైన స్థలాన్ని సేకరించనున్నట్లు తెలిపారు. ముదిరాజ్‌ల సమస్యల పరిష్కారం కోసం ముందుండాలని సూచించారు. అనంతరం స్థానిక గ్రామ పంచాయతీలో సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు మిట్టపల్లి సుదర్శన్, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ ఆసం శివకుమార్ యువజన అధ్యక్షుడు శేఖర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు బొజ్జ నర్సయ్య, బైరి చందు, మల్యాల గణేశ్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

✦ఇంటర్ పరీక్ష కేంద్రం తనిఖీ

సారంగాపూర్: సారంగాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం జరిగిన ఇంటర్ పరీక్షా కేంద్రాన్ని సారంగాపూర్ తహసీల్దార్ రవీందర్‌రావు తనిఖీ చేశారు.

✦ప్రశ్నపత్రాల లీకేజీపై విచారించాలి

మెట్‌పల్లి: ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారంపై ప్రభుత్వం సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలని కాంగ్రెస్ నాయకులు కొమిరెడ్డి కరంచంద్ గురువారం డిమాండ్ చేశారు. ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

✦నేడు అదనపుయూనిట్ల లబ్ధిదారుల ఎంపిక

మల్యాల: మైనార్టీ కార్పొరేషన్ కింద 2022–23లో మంజూరైన మూడు అదనపు యూనిట్లకు 17న స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేయనున్నట్లు ఎంపీడీవో వెంకటేశం తెలిపారు.

✦రాజేశంపై దాడి చేసిన వారిని శిక్షించాలి

సారంగాపూర్: మండలంలోని రేచపల్లికి చెందిన పౌరహక్కుల సంఘం నేత పోగుల రాజేశంపై అకారణంగా దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు చుక్క గంగారెడ్డి కోరారు. ఈ మేరకు గురువారం ఆయన మాట్లాడుతూ దాడి చేసిన వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

✦నియామకం

ఇబ్రహీంపట్నం: ఏప్రిల్ 3వ తేదీ నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షలకు మండలంలోని మూడు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. కాగా ఈ కేంద్రాలకు చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంట్ ఆపీసర్లను నియమించినట్లు ఇన్‌చార్జి ఎంఈవో ఆనంద్‌రావు గురువారం తెలిపారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గోదూర్, ఇబ్రహీంపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మోడల్‌స్కూల్ ఇబ్రహీంపట్నంలలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ పరీక్ష కేంద్రాలకు చీఫ్ సూపరింటెండెంట్లుగా గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, గోల్కొండ నాగరాజు, ర్యాగల మహేశ్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ అధికారులుగా మద్దిరాల గణేశ్, లక్ష్మీనారాయణ, శ్రీధర్‌కుమార్‌ను నియమించినట్లు వివరించారు.

✦రుణాల ఎంపికకు ఇంటర్వ్యూ

పెగడపల్లి: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన దివ్యాంగ అభ్యర్థులకు రుణాల ఎంపికకు గురువారం పెగడపల్లి మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు ఇంటర్వ్యూ నిర్వహించారు. 32 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా 25 మంది ఇంటర్వ్యూకు హాజరైనట్లు ఎంపీడీవో పుల్లయ్య తెలిపారు. లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరుగుతుందని ఎంపీడీవో పేర్కొన్నారు.

✦చిన్నారులకు అన్నప్రాసన

కథలాపూర్: మండలంలోని దుంపేట, ఊట్‌పెల్లి, రాజారాం తండా గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం చిన్నారులకు అన్నప్రాసన చేశారు. గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధిక, అంగన్‌వాడీ టీచర్లు సునీత, అనసూర్య, సంధ్య పాల్గొన్నారు.

✦చిన్నారుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

మల్లాపూర్: చిన్నారుల ఆరోగ్యంపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆర్‌బీఎస్‌కే వైద్యురాలు డాక్టర్ శ్రావిక అన్నారు. ఈ మేరకు గురువారం మండలంలోని రేగుంట అంగన్‌వాడీ కేంద్రంలో రాష్ట్రీయ బాల స్వస్థ్య కార్యక్రమం అమలులో భాగంగా తెలంగాణ హెల్త్ అండ్ వెల్ఫేర్ శాఖ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే ఫార్మసిస్టు రాధ, ఏఎన్‌ఎం సరిత, అంగన్‌వాడీ టీచర్ విజయ పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల్లో కూలీల సంఖ్య పెంచాలి



పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో రాజేందర్

సారంగాపూర్: ఉపాధిహామీ పనుల్లో కూలీల సంఖ్య పెంచాలని ఎంపీడీవో రాజేందర్ సూచించారు. ఈ మేరకు గురువారం మండలంలోని పెంబట్ల గ్రామంలో నర్సరీలో కొనసాగుతున్న పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా నర్సరీలో పెరుగుతున్న 5వేల మొక్కలు ఎండకుండా అవసరమైన మేర నీరు అందించాలని ఆదేశించారు. అనంతరం గ్రామశివారుల్లోని అటవీప్రాంతంలో జరుగుతున్న సమతుల కందకాల ఏర్పాటు పనులను పరిశీలించి, పనుల్లో కూలీల సంఖ్య పెంచాలన్నారు. ఆయన వెంట ఏపీవో గంగాధర్, ఫీల్డ్ అసిస్టెంట్ కొలపాక రాజు ఉన్నారు.

ఘనంగా పెద్దమ్మతల్లి జాతర



జాతరలో పాల్గొన్న భక్తులు

కథలాపూర్: మండలంలోని గంభీర్‌పూర్ గ్రామంలో పెద్దమ్మతల్లి జాతర గురువారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, ఉత్సవాలు నిర్వహించారు. బోనాల ఊరేగింపు చేసి పెద్దమ్మతల్లికి నైవేద్యం సమర్పించారు. ఉత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మురుగు తొలగింపునకు చర్యలు

సాక్షి ఎఫెక్ట్..



పనులను పరిశీలిస్తున్న కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్

మెట్‌పల్లి: పట్టణంలోని 12వ వార్డులోని రిలయన్స్ స్టోర్ వెనుక ఉన్న ఖాళీ స్థలంలో నిలిచిన మురుగు తొలగించే పనులను గురువారం అధికారులు ప్రారంభించారు. కాగా బుధవారం ‘సాక్షి’లో ఈ సమస్యపై ‘మురుగు తొలగింపుపై నిర్లక్ష్యం’ శీర్షికన వార్త ప్రచురితమైంది. స్పందించిన కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్ సిబ్బందితో కలిసి పరిశీలించారు. అనంతరం చర్యలు చేపట్టారు. ఆయన వెంట ఆర్‌ఐ అక్షయ్, శానిటేషన్ ఇన్‌చార్జి రత్నాకర్, సిబ్బంది ముజీబ్ ఉన్నారు.

అక్రమ లేఅవుట్ ప్లాట్లు కొనుగోలు చేయొద్దు



లేఅవుట్లను పరిశీలిస్తున్న మున్సిపల్ అధికారులు

కోరుట్ల: పట్టణ శివారులో అక్రమ లే అవుట్ ప్లాట్లను కొనుగోలు చేయొద్దని మున్సిపల్ అధికారులు సూచించారు. ఈ మేరకు పట్టణ శివారులో అనుమతి లేని లే అవుట్ ప్లాట్లను గురువారం టౌన్ ప్లానింగ్ ఏసీపీ ఆధ్వర్యంలో టీపీఎస్, సిబ్బంది పరిశీలించారు. ఈ సందర్భంగా కల్లూర్ రోడ్, జగిత్యాల, మెట్‌పల్లి రోడ్, ఐలాపూర్ రోడ్, ఆదర్శనగర్ ప్రాంతాల్లో అక్రమ లేఅవుట్ ప్లాట్లను గుర్తించారు. సర్వే నంబర్లు 458, 451, 452, 453, 1284, 1463, 782,783, 790లో సుమారు 12 ఎకరాల్లో ప్లాట్లు విక్రయిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈ సర్వే నంబర్లలోని ప్లాట్లు కొనుగోలు చేసిన వారికి ఇళ్ల నిర్మాణాలకు అనుమతి ఇవ్వడం కుదరదని స్పష్టం చేశారు. అంతే కాకుండా ఈ ప్రాంతంలో ఎలాంటి అభివృద్ధి పనులు, మౌలిక వసతులు కల్పించబోమని పేర్కొన్నారు.

లయన్స్‌క్లబ్ సేవలను విస్తృతం చేయాలి



సమావేశంలో జిల్లా గవర్నర్ నారాయణరెడ్డి

మల్లాపూర్: లయన్స్‌క్లబ్ సేవలను విస్తృతం చేయాలని, సామాజిక సేవా కార్యక్రమాలతోనే గుర్తింపు లభిస్తుందని లయన్స్‌క్లబ్ జిల్లా గవర్నర్ రిక్కుల నారాయణరెడ్డి అన్నారు. ఈ మేరకు గురువారం మండల కేంద్రంలో లయన్స్‌క్లబ్ మండల అధ్యక్షుడు సాదుల్ల వెంకటస్వామి అధ్యక్షతన ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. నూతనంగా లయన్స్‌క్లబ్ సభ్యులు మంచిసేవలు చేపట్టి ప్రజల గుర్తింపు పొందాలని కోరారు. సమావేశంలో లయన్స్ క్లబ్ రీజినల్ చైర్మన్ అల్లిమల్ల ఉష కిరణ్, జోనల్ చైర్మన్ కోట గంగజీవన్, మాజీ జోనల్ చైర్మన్ శివ శ్రీనివాస్, మాజీ అధ్యక్షుడు రుద్ర రాంప్రసాద్, కార్యదర్శి ఎండీ.రఫీ, కోశాధికారి బోయిని సిద్దయ్య పాల్గొన్నారు.

మల్యాలలో ప్రతీ సోమవారం ప్రజావాణి

మల్యాల: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ప్రతీ సోమవారం ప్రజావాణి నిర్వహించనున్నట్లు తహసీల్దార్ సుజాత తెలిపారు. ఈ మేరకు కలెక్టర్ యాస్మిన్‌బాషా ఉత్తర్వులు జారీ చేశారు. ప్రతి సోమవారం ప్రజావాణి నిర్వహించి, సాయంత్రం 3గంటల్లోగా జిల్లా కేంద్రానికి నివేదించాలి. 10 రోజుల్లో సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన అంశాలతో కూడిన నివేదిక అందజేయాల్సి ఉంటుంది. ఇకపై ప్రతి సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రజావాణి నిర్వహించనున్నట్లు తహసీల్దార్ వివరించారు. ప్రజావాణిలో ఎంపీడీవో, ఎంపీవో, మండల వ్యవసాయాధికారి, మండల విద్యాధికారి, పంచాయతీ రాజ్ అసిస్టెంట్ ఇంజనీర్, విద్యుత్ ఏఈ, పశు వైద్యాధికారి, సెర్ప్ ఏపీఎం పాల్గొంటారని పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి ప్రజావాణిని వినియోగించుకోవాలని తహసీల్దార్ కోరారు.

రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి



నువ్వు పంటను పరిశీలిస్తున్న ఏవో లావణ్య

మల్లాపూర్: పంటను ఆశించే రసం పీల్చే పురుగుల నివారణకు రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి లావణ్య సూచించారు. ఈ మేరకు గురువారం మండలంలోని కుస్తాపూర్‌లో వ్యవసాయ అధికారులు, రైతులతో కలిసి రైతులకు జాతీయ ఆహార భద్రత పథకంపై ఆమె అవగాహన కల్పించారు. సర్పంచ్ సరికెల లక్ష్మి, ఎంపీటీసీ దేవ ముత్తమ్మ, నాయకులు సరికెల మహిపాల్, ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

పాఠశాలలో ప్లాంట్ ఏర్పాటుకు రూ.లక్ష అందజేత



ఓగుల అజయ్‌తో నాయకులు, గ్రామస్తులు

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం కొల్వాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల కోసం శుద్ధ జల ప్లాంట్ ఏర్పాటుకు తుంగూర్ గ్రామానికి చెందిన ఓగుల అజయ్ రూ.లక్ష అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు అజయ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. జెడ్పీటీసీ పాత పద్మ, సర్పంచ్ మేను ఏసుదాసు, కొల్వాయి సింగిల్ విండో చైర్మన్ పొల్సాని నవీన్‌రావు, ఎంపీటీసీ రంగు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న జెడ్పీ వైస్‌చైర్మన్

మేడిపెల్లి: బీమారం మండలం ఈదుల లింగంపేట్ గ్రామంలోని కురుమపల్లి నుంచి శివాలయం వరకు రూ.15లక్షలతో చేపట్టనున్న సీసీరోడ్డు పనులకు గురువారం జెడ్పీ వైస్‌చైర్మన్ హరిచరణ్‌రావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ వంగ వెంకటేశం, ఎంపీడీవో వెంకటేశ్ జాదవ్, దొంతి శ్రీనివాస్, సత్తి రెడ్డి, జలపతిరెడ్డి పాల్గొన్నారు.

ఉచిత కోచింగ్ సెంటర్‌ను వినియోగించుకోవాలి

ధర్మపురి: నిరుద్యోగ యువత సౌకర్యం కోసం ఏర్పాటు చేస్తున్న ఉచిత కోచింగ్ సెంటర్‌ను నిరుద్యోగులు వినియోగించుకోవాలని బీఆర్‌ఎస్ పట్టణశాఖ అధ్యక్షుడు ఆకుల రాజేశ్ కోరారు. ఈ మేరకు రాష్ట్ర మంత్రి కొప్పుల ఈశ్వర్ సహకారంతో ఎస్‌ఈ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మండలంలోని ఎస్సీ నిరుద్యోగ యువత కోసం ఉచిత కంప్యూటర్ కోర్సు, నర్సింగ్ కోర్సుల్లో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నారు. 3 నెలల పాటు సాగే ఉచిత కోచింగ్‌లో ఉచిత భోజనం, వసతి సౌకర్యం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. కోచింగ్ అనంతరం ప్రైవేట్ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని, వివరాలకు 8106645824 (రవికిరణ్ సెంటర్ ఇన్‌చార్జి) నంబర్‌ను సంప్రదించాలని రాజేశ్ సూచించారు.